ప్రజాశక్తి
శుక్రవారం 14 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం

నేడు ప్రచార భేరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే ప్రచార భేరిని నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం వద్ద శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభిస్తున్నట్లు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. స్టేడియం నుంచి ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఏడు రోడ్ల కూడలి మీదుగా రామలక్ష్మణ కూడలికి చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు ప్రచార భేరి ప్రారంభంలో పాల్గొంటారని తెలిపారు.

ప్రతిపాదనలతోనే సరి

- 2021లోనే ప్రమాదకర వరద ముంపు ప్రాంతాల గుర్తింపు
- రెండేళ్లు గడిచినా అనుమతులు ఇవ్వని ప్రభుత్వం
- తాజాగా మరోసారి ప్రతిపాదనలు పంపిన అధికారులు
- వంశధార, నాగావళి కరకట్టల పనులపై ఉదాసీనం

కరకట్టల నిర్మాణాల విషయంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి కనబరుస్తోంది. కరకట్టల నిర్మాణానికి పెద్దఎత్తున భూమిని సేకరించాల్సి ఉండడం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ఉన్నపళంగా కరకట్టల నిర్మాణాలను రద్దు చేసింది. అత్యంత ప్రమాదరకరమైన ప్రాంతాల్లో వరద గట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలను పంపాలని అధికారులకు సూచించింది. జిల్లాలో ఆవిధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అధికారులు 2021 ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటివరకు వాటికి ఆమోదం తెలపలేదు. వేసవి నేపథ్యంలో పనులు చేపట్టేందుకు అనువుగా ఉండడంతో అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి ప్రతిపాదనలు పంపారు. ఈసారైనా ప్రభుత్వం ఆమోదం తెలిపితే వరద ముప్పు నుంచి కొన్ని గ్రామాలనైనా రక్షించుకునే వీలుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కలివరంలో కోతకు గురైన ఆర్‌బికె (ఫైల్)

నాగావళి ఉధృతితో కోతకు గురైన గట్టు

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి అధిగమించడానికి గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తాకూస్తో పనులు చేపట్టినా, ఆ తర్వాత నుంచి ఒక్క అడుగూ ముందుకు పడడం లేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 25 శాతం లోపు ఖర్చయిన పనులను నిలిపేసి వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. ముంపు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. దీంతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. నాగావళి నది పరివాహక ప్రాంతమైన ఆమదాలవలస మండలం తొగరాం వద్ద రూ.13.14 కోట్లతో, గంగ్రేడు వద్ద రూ.8.82 కోట్లతో, బెలమాం వద్ద రూ.1.83 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బూర్జ మండలం అల్లెన నుంచి బూర్జ పాత కరకట్ట వరకు వరద గట్టు కోసం రూ.13.86 కోట్లతో మొత్తం రూ.37.65 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కిలోమీటర్ల మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపి రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఆమోదం తెలపలేదు.

కరకట్టల పనుల పరిస్థితి ఇలా...

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనులు 2007లో ప్రారంభించారు. ఇప్పటివరకు 7.55 శాతం పనులే పూర్తయ్యాయి. 2007లోనే మొదలైన ప్యాకేజీ-2 పనులు 5.66 శాతం మాత్రమే జరిగాయి. ప్యాకేజీ-3 పనులను 2007లో ప్రారంభించారు. 2.45 శాతం పనులు పూర్తి చేశారు. 2009లో ప్రారంభమైన ప్యాకేజీ-4 పనులు 21.32 శాతం మాత్రమే జరిగాయి. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టల పరిస్థితి అలానే ఉంది.

జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను నాగావళి-2 ప్యాకేజీ పనులుగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్ సంస్థకు రూ.61.45 కోట్లకు పనులను అప్పగించారు. 2008లోనే పనులను ప్రారంభించింది. ఇప్పటికీ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కి.మీ మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 17.29 కి.మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకొచ్చాక 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ 2019 మే 29న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపివేశారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

వంశధార నదీ పరివాహక ప్రదేశాల్లో అత్యంత వరద ముప్పు ఉన్న ప్రాంతాలను గుర్తించి గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఈ ఏడాది ఫిబ్రవరి ఏడో తేదీన మరో పర్యాయం ప్రతిపాదనలు సమర్పించాం. ప్రభుత్వం ఆమోదం తెలిపితే పనులు ప్రారంభిస్తాం.

- పి.అప్పలనాయుడు,
ఇఇ, ప్రత్యేక పరిశోధన విభాగం

ప్రభుత్వం ఆమోదిస్తే పనులు ప్రారంభం

నాగావళి నదీ పరివాహక గ్రామాల్లో ప్రమాదకరమైన వరద ముంపు ప్రాంతాలను గుర్తించాం. ప్రభుత్వానికి రెండు, మూడు పర్యాయాలు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం ఆమోదిస్తే పనులు ప్రారంభిస్తాం.

- సుధాకరరావు,
ఇఇ, ప్రత్యేక కట్టడాల విభాగం

స్పీకర్‌కు సమస్యలను వివరిస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో గురువారం నిర్వహించిన సమావేశంలో స్పీకర్‌కు కార్మికులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అరకొర వేతనాలతో జీవిస్తున్నామని, తమకు నిలిపివేసిన తెల్ల రేషన్‌కార్డులను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సంక్షేమ పథకాలను తమకు వర్తింపజేసేలా న్యాయం చేయాలన్నారు. వీటిపై స్పీకర్ స్పందిస్తూ ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్మికులు బాధ్యతతో పనిచేసి పట్టణంలో స్వచ్ఛతను సాధించాలన్నారు. పరిశుభ్ర ఆమదాలవలసను తయారు చేసి ఆరోగ్యవంతమైన సమాజానికి పునాదులు వేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు ఇచ్చే రూ.15 వేల వేతనానికి అదనంగా ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ రూపేణా రూ.ఆరు వేలు చెల్లించేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ పరిధిలో చేర్చడం వల్ల సామాజిక హోదా కల్పించినట్లయిందన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మున్సిపల్ సచివాలయాల కోఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, వైసిపి నాయకులు బోర చిన్నంనాయుడు, దుంపల శ్యామలరావు, కె.శ్యామ్‌ప్రసాదరావు, పొడుగు శ్రీను, సాధు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

జిల్లా అగ్నిమాపక అధికారి బి.వీరభద్రరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి బి.వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లు, గృహ, ఆస్పత్రుల సముదాయాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, గ్యాస్ ఏజెన్సీలు, పలు స్వచ్ఛంద సంస్థల వద్ద అగ్నిమాపక నివారణ చర్యలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళంతో పాటు ఇచ్ఛాపురం, పలాస, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, ఆమదాలవలస, కొత్తూరు, రణస్థలంలో నిర్ధేశించిన ప్రాంతాల్లో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 101 నంబరుకు ఫోన్ చేయాలని, లేకుంటే సమీపంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

స్వేచ్ఛావతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 17 నుంచి మే 15వ తేదీ వరకు ఇచ్ఛాపురంలో పదేళ్లకోసారి నిర్వహించే స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉత్సవాల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు పరిసర మండలాలతో పాటు ఒడిశా నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చే అవకాశముందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేక పర్వదినాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ఉత్సవాలకు సమాచార కేంద్రాలను పలుచోట్ల ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ యాత్రికులకు అసౌకర్యం లేకుండా నిరంతర తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో కంట్రోల్‌రూమ్‌ను నిర్వహించాలని ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం కలిగితే సంప్రదించాల్సిన ఫోన్ నంబరును అందరికి తెలిసేలా ప్రముఖ కూడళ్ల వద్ద ప్రదర్శించాలన్నారు. ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ ఉత్సవాలకు పకడ్బందీ పోలీసు బందోబస్తు కల్పిస్తున్నట్లు తెలిపారు. యాత్రికుల సౌకర్యార్థం 112 నంబరుతో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

మంత్రి ధర్మానను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, కమిటీ ప్రతినిధులు

అనంతరం జిల్లా అగ్నిమాపక శాఖ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లు, బ్యానర్లు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్యారోగ్యశాఖ రూపొందించిన పోస్టర్లు, బ్యానర్లను మంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, పిరియా సాయిరాజ్, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒ సీతారామ్మూర్తి, తహశీల్దార్ జి.గురుప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకే పోర్టు

- ఎన్నికల్లోగా తొలి దశ నిర్మాణం పూర్తి
- మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఉద్యోగ, ఉపాధి కల్పనకే భావనపాడు పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని సుంకర జగన్నాథపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోర్టు రాకతో ఈ ప్రాంతవాసుల చిరకాల కల నెరవేరుతుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం, చిత్తశుద్ధి కొరవడడం వల్లే పోర్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుందని విమర్శించారు. పోర్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం వలసలు అన్న మాటే వినిపించదని చెప్పారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి పోర్టు నిర్మాణంపై ముందుకు సాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోగా పోర్టు తొలి దశ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్యనాయుడు, మద్దిల హరినారాయణ, మాజీ సర్పంచ్ జి.గున్నమ్మ, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మత్స్యశాఖ మంత్రి అప్పలరాజు



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని సైకత శిల్పి గేదెల హరికృష్ణ మండలంలోని గాజుల కొల్లివలసలో అంబేద్కర్ సైకత శిల్పాన్ని చెక్కారు. సైకత శిల్పాన్ని చూసేందుకు వచ్చిన వారు హరికృష్ణను అభినందించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం కావాలి

సిసిఎల్ఎ జి.సాయిప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో చేపడుతున్న రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. రెండో విడత రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఫేజ్-2 కింద చేపట్టిన రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులు మరింత వేగవంతం కావాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ కోసం అవసరమైన అదనపు రోవర్లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పినా పనుల్లో జాప్యమవుతోందన్నారు. జిల్లాలో రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ లక్ష్యాలను అధిగమించడంపై హర్షం వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలోని 126 రీ సర్వే గ్రామాలకు గానూ ఇప్పటికే 23 గ్రామాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన గ్రామాలు తుది దశలో ఉన్నాయని, ఈనెల 17వ తేదీ నాటికి పూర్తి కాగలవన్నారు. స్టోన్ ప్లాంటేషన్‌లో ఇప్పటికే 9,200 చేసి లక్ష్యాన్ని అధిగమించామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో సర్వే ల్యాండ్ రికార్డుల సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి నవీన్

అలాంటి వాలంటీర్లపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు కూన రవికుమార్ లేఖ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం నుంచి పారితోషికాలు తీసుకుంటున్న వాలంటీర్లు వైసిపి కార్యక్రమాలు చేపడితే వారిపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. జిల్లాలో కొందరు వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వైసిపి స్టిక్కర్లు ఇంటి గోడలకు అంటిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. స్టిక్కర్లను అతికిస్తున్న వాలంటీర్లను గుర్తించి తగిన ఆధారాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వం నసుంచి జీతాలు తీసుకుంటూ రాజకీయ పార్టీకి అనుకూలంగా పనిచేయడం, ఇంటి యజమానుల అంగీకార పత్రాలు తీసుకోకుండా గోడలకు స్టిక్కర్లు అతికించడం చట్టరీత్యా నేరమన్నారు. వాలంటీర్లు ఎటువంటి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనరాదని ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ బూత్ లెవల్ అధికారులు చేపడతారని ఎక్కడైనా వాలంటీర్లు గానీ, సచివాలయ సిబ్బంది గానీ చేపడితే ఫొటోలు తీసి ఆధారాలతో టిడిపి జిల్లా కార్యాలయానికి అందజేయాలన్నారు.

ఫిష్ ఆంధ్రను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

'ఫిష్ ఆంధ్ర'తో నిరుద్యోగ యువతకు ఉపాధి

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

ఫిష్ ఆంధ్ర డెలిసియస్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని రాగోలులో ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మత్స్యకారుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో సబ్సిడీ అందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాలను గుర్తించి అర్హత గల యువతను ఎంపిక చేసి 27 ఫిష్ ఆంధ్ర డెలిసియస్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అరసవల్లికి చెందిన ఎ.హటకేశ్వరరావుకు ఫిష్ ఆంధ్ర డెలిసియస్ యూనిట్ మంజూరు చేయగా యూనిట్‌కు రూ.10 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు.

ఈ యూనిట్‌లో ఫిష్ ఆంధ్ర డెలిషియస్ యూనిట్‌లో ఫ్రెంచ్ ఫ్రెస్, ఫిష్ బర్గర్, చికెన్ బర్గర్, ఛీజ్ బర్గర్, క్రంచీ ఫ్రైస్, క్రంచీ షిమ్, క్రేబ్ స్టిక్స్, ఫిష్ అండ్ చిప్స్, ఛీజ్ బటన్స్, బెల్జియం ఫ్రైస్, చికెన్ మమ్మో, వెజ్ మమ్మో, పన్నీర్ మమ్మో, క్రంచి మమ్మో, ఫ్రెస్ మ్యాంగో ఐష్ క్రీమ్, బ్రౌనీ విత్ ఐస్ క్రీమ్, కశ్మీరీ కవాటీ, లెమన్ పెప్పర్ టిక్కా, చిట్టి నాడు ఫిష్ టిక్కా తదితర రకాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి నిర్మల శ్రీనివాస్, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, మత్స్యశాఖ జెడి పి.శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షులు కోనాడ నర్సింగరావు, సర్పంచ్ గేదెల చెంగలరావు, మాజీ ఎంపిపి చిట్టి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను సరిచేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల జాబితాల్లో కొత్తగా మార్పులు, చేర్పులు, తొలగించాల్సిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించి సరిచేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. అమరావతి నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాకు సంబంధించి జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల నాయకులతో సమన్వయ కమిటీ సమావేశాలు, ఏ ఏ సందర్భాలలో సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలనే విషయమై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తయారు చేసుకోవాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ

పంచాయతీ ఇఒగా కృష్ణారావు

కోటబొమ్మాళి: మేజరు పంచాయతీ ఇఒగా కె.కృష్ణారావు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇఒగా పని చేసిన యోగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కృష్ణారావు కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. డిపిఒ ఆదేశాల మేరకు ఇఒగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె.సంజీవరావు, బోయిన నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ బాలకృష్ణారెడ్డి, బి.కృష్ణారావు, చిరంజీవులు, సచివాలయ సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు.

కృష్ణారావు

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పనులను పరిశీలిస్తున్న ఎంపీ, తదితరులు

తిలారు రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేటు, ఇతర అభివృద్ధి పనులను శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం పరిశీలించారు. రైల్వే గేటు పడిన ప్రతి సారి వాహనదారులు, తిలారు గ్రామస్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని ఎంపీని గ్రామస్తులు కోరారు. దీంతో ఎంపీ విశాఖ రైల్వే డిఎంతో మాట్లాడారు. దీంతో అండర్ పాసేజ్ మంజూరు చేశారు. గురువారం చేపట్టిన పనులను ఎంపీ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, టిడిపి నాయకులు శిమ్మ నారాయణరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కిట్లు అందజేస్తున్న దానేటి శ్రీధర్

జిల్లాలోని క్షయ రోగులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన పౌష్టికాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో 70 మంది రోగులకు ఒక్కొక్కరికి సుమారు రూ.700 విలువ చేసే కిట్లను ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, టిబి నివారణ అధికారి ఎస్.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లికి వెండి దండ కడియాలు వితరణ

ఇఒకు దండ కడియాలు అందజేస్తున్న నాగయ్యరెడ్డి

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లికి స్థానిక రెడ్డిక వీధికి చెందిన టిడిపి సీనియరు నాయకుడు కిల్లి నాగయ్యరెడ్డి గురువారం రూ.20వేలు విలువైన వెండి దండ కడియాలను వితరణగా ఇచ్చారు. గురువారం ఆలయ ఇఒ రాధాకృష్ణ ఆలయ సన్నిధిలో మాజీ ఎఎంసి చైర్మన్ కిల్లి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యాన అందజేశారు. అమ్మవారికి దండ కడియాలు చేసి ఇవ్వాలని కోరిక ఉండేదని, అది ఇప్పుడు నెరవేరిందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఇఒ రాధాకృష్ణ అన్నారు. కార్యక్రమంలో కిల్లి నాగయ్యరెడ్డి, కుటుంబసభ్యులు కిల్లి శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టిక్కెట్ రేసులో ఉన్నా

ప్రజాశక్తి - జి.సిగడాం

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎమ్మెల్యే టిక్కెట్ రేసులోఉన్నానని మండలంలోని సంతవురిటికి చెందిన పైడి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం సిఎం జగన్మోహన్‌రెడ్డి నుంచి తనకు ఫోన్ వచ్చిందని, ఈ సారి మీకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని చెప్పారని అన్నారు. మా కుటుంబ సభ్యులు అందించిన కొన్ని సేవలను గుర్తించారని, మండలంలో 30వేలకుపైగా ఓట్లు తెలగ కమ్యూనిటీ చెందినవేనని, మిగతా సామాజిక తరగతులు కూడా మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రాథమిక సమస్యలను, నిరుద్యోగ, రైతాంగ సమస్యలు, సాగునీటి సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. తోటపల్లి డ్యాం నీరు నియోజకవర్గానికి అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

నియోజకవర్గంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే పలు పురాతన దేవాలయాల పునర్నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో దేవదాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవాదాయశాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన పలు దేవాలయాలు గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వాటి ప్రాశస్థి క్రమంగా తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలో పలు దేవాలయాలు పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినట్ల తెలిపారు. ఆలయాల పునర్నిర్మాణానికి 10 శాతం నగదు డిపాజిట్ చేసిన ఆయా గ్రామాల దేవాలయాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. పునర్నిర్మాణ పనులు చేపట్టిన పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.. కొత్తవలసలోని సీతారామ ఆలయానికి రూ.50 లక్షలు, కొల్లివలసలో సంగమేశ్వర ఆలయానికి రూ.30 లక్షలు, ఇలా పలు ఆలయాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో అర్జెసి డిసి సునీత, ఎసి ప్రసాదరావు, వైసిపి నాయుకలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆమదాలవలస: కరపత్రం అందిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాసమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పార్వతీశంపేటలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుండి లబ్ధిదారులు పొందిన లబ్ధిని వారికి వివరించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, సంపతిరావు రామారావు, దుంపల చిరంజీవి, పొడుగు శ్రీను, బొడ్డేపల్లి రాజు, సనపల రాజు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: గడప గడపకు మన ప్రభుత్వంలో స్పీకర్ సీతారాంకు ప్రజలు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. పాలవలస పంచాయతీ కొత్త లక్కుపురం, మర్రిపాడు, కొత్తవలస గ్రామాల్లో స్పీకర్ పర్యటించారు. తాగునీటి సమస్య అధికంగా ఉందని కొత్త లక్కుపురం వాసులు స్పీకర్ దృష్టికి తెచ్చారు. మర్రిపాడు, కొత్తవలస గ్రామంలో రహదారి అధ్వానంగా ఉందని చెప్పారు. వీటి పరిష్కారానికి స్పీకర్ కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీప, జెడ్‌పిటిసి రామారావు, రాంబాబు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు పనులు వేగవంతం చేయాలి

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - పోలాకి

కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

మండల కేంద్రంలో అమృత్ సరోవర్ ట్యాంక్ పనులు వేగవంతం చేయాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు ఆదేశించారు. గురువారం సుసరాం పంచాయతీలో చేపడుతున్న అమృత్ సరోవర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనుల్లో భాగంగా చెరువు గట్టుపై ప్లాంటేషన్, వాల్స్, బెంచ్ కటింగ్ ఏర్పాటు చేసి, అందంగా అభివృద్ధి చేయాలన్నారు. దీనికి రూ.10 లక్షలు కేటాయించామని తెలిపారు. ఉపాధి హామీ కూలీలు రూ.230 కూలి వచ్చేలా పనులు కల్పించాలని సూచించారు. వేసవి దృష్ట్యా ఉదయం 7.30 నుండి 10.30 వరకు, మధ్యాహ్నం 3.30 నుండి 5.30 వరకు చల్లని సమయంలో రెండు పూటలు పనులు కల్పించాలని సూచించారు. ప్రతి కూలీ పిఎం సురక్ష బీమా యోజనలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో 22,400 మంది కూలీలకు 9,680 మందికి పనులు కల్పించినట్లు ఎపిఒ రమణ పీడీకి వివరించారు. అవకాశం ఉన్నంతలో ఎక్కువ మందికి పనులు కల్పించాలని పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ రమణ, ఇసి గోవిందరావు, టిఎ సురేష్, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మేఘవరం గ్రామంలో ఉపాధి హామీ పనులను జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు పూటలు పనికి వెళ్లి రోజుకు రూ.275 కూలి వచ్చేలా పని చేయాలన్నారు. అనంతరం మేఘవరంలో జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క బీమారావు, సర్పంచ్ పి.సునీతా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి సూరాడ రాజారావు, వైస్ సర్పంచ్ సింహాచలం, పి.మేనకేతన్‌రెడ్డి, గోవిందరావు, ఉపాధి కూలీలు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల శాల దగ్ధం

ప్రజాశక్తి - జలుమూరు

అగ్ని ప్రమాదంలో బూడిదైన పశువుల శాల

మండలంలోని రామయ్యవలసలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో జామాన నరసింహులకు చెందిన పశువుల శాల అగ్నికి ఆహుతైంది. ఆవుకు తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ప్రమాదంలో పశువుల శాలలో ఉన్న ధాన్యం, వ్యవసాయ పరికరాలు కాలిబూడిద అయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.50వేలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోతున్నాడు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో భాగంగా ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలానా బ్యాంకు నుండి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్లు చేసి మన బ్యాంక్ అకౌంటు వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. బ్యాంకులు అటువంటి సమాచారాన్ని లబ్ధిదారులకు అడగవని తెలిపారు. ఎటిఎంలలో డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని ఎటిఎం కార్డును ఇవ్వరాదని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం 20 రూపాయలతో రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం రూ.330కే రూ.2 లక్షల జీవిత బీమా లభిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ఇన్సురెన్స్ పథకాలను విపులంగా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్లా సింహాచలం, పంచాయతీ సెక్రెటరీ రమణమ్మ, సిఎఫ్ గాయత్రి, ఫీల్డ్ అసిస్టెంట్ సంధ్య, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్‌లు చిగురుపల్లి వెంకటేష్, రామారావు,గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మృతుల కుటుంబానికి పరిహారం అందజేత

ప్రజాశక్తి - ఆమదాలవలస

చెక్కు అందజేస్తున్న సీతారాం

పురపాలక సంఘంలో ఎల్‌జిఎస్‌గా విధులు నిర్వహిస్తూ గతంలో మరణించిన కూన వెంకటరమణ, దుంపల సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను స్పీకర్ సీతారాం గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు ఎం.రవిసుధాకర్, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, అకౌంటెంట్ ఐ.సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

దిద్దుబాటు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టియు నాయకులు

పదో తరగతి పరీక్ష పత్రాల దిద్దుబాటు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ పగడాలమ్మకు గురువారం వినతిపత్రం అందజేశారు. స్పాట్ కేంద్రాల్లో జనరేటర్ సౌకర్యం కల్పించాలని, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వైద్యులతో కూడిన బృందాలను కేంద్రాల వద్ద నియమించాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆంగ్ల మాధ్యమాన్ని బోధిస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు స్పాట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు పడాల తమ్మినాయుడు, ఎస్.వి రమణ, పేడాడ ప్రభాకరరావులు ఉన్నారు.

తండ్రి ఆత్మహత్య కేసులో కుమారుడు అరెస్టు

మెళియాపుట్టి: మండలంలోని చాపరలో మంగళవారం పట్టపగలు గురుమూర్తి బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈకేసులో రెండో కుమారుడు షణ్ముఖరావును పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కోర్టు ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు.

గ్రామాల్లో సామాజిక ఆర్థిక సర్వే

ప్రజాశక్తి - పలాస

సర్వే చేస్తున్న అధికారులు

గ్రామాల్లో సామాజిక ఆర్థిక సర్వేను చేస్తున్నామని జిల్లా ఉప గణాంకాధికారి దేసూళ సురేంద్ర తెలిపారు. గురువారం పలాసలో కేమ్స్, ఆయూష్ సర్వేను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1950 నుంచి సర్వే చేస్తున్నారని, 2022-23 ఏడాదికి 79వ రౌండ్‌లో కేమ్స్, ఆయూష్ ఆరోగ్య గురించి సర్వే చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 20 గ్రామాల్లో 20 శాంపిల్స్ సర్వే చేయడం జరుగుతుందన్నారు. సర్వేలో కనీస సదుపాయాలు మంచినీరు, రోడ్లు, ఆస్పత్రి, బస్సు సౌకర్యం, వైద్యం, మొబైల్ నెట్‌వర్క్, కంప్యూటర్, టీవీ వాడకం, శానిటేషన్ వినియోగం వగైరా అవసరమైన సమాచారాన్ని సేకరిస్తున్నామని తెలిపారు. ఆయనతో పాటు పిసి నందా, ఎఎస్ఒ జోగారావు, వాలంటీర్లు ఉన్నారు.

బాల్య దశే కీలకం

విద్యార్థులతో సిబ్బంది

టెక్కలి: పాఠశాల విద్యార్థుల్లో బాల్య దశ కీలకమని ఎఫ్‌బిఒబి ఝాన్సీరాణి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో స్నాతకోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నతనంలో పొందిన అనుభుతులను గుర్తుంచుకుని భవిష్యత్‌కు దాన్ని వినియోగించుకోవాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ క్రమశిక్షణ, మంచి అలవాట్లు చిన్నతనం నుంచే అలవడాలని అన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ నాగరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

భూసార పరీక్షలతో ఎరువుల వాడకం తగ్గించి, అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్ అన్నారు. పరశురాంపురం ఆర్‌బికెలో భూ సార పరీక్షలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకోవడం వల్ల రైతులు ఏ మోతాదులో ఎరువులు వేసుకోవాలో తెలుస్తుందని, ఎరువుల ఖర్చును చాలా వరకు తగ్గించుకోవచ్చని అన్నారు. 12 రకాల పోషకాలను పరీక్ష జరిపి రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువు విరివిగా వాడాలని, వీటి వల్ల భూమిలో కర్బన స్థాయి పెరిగి ఆరోగ్యవంతమైన, రుచికరమైన పంటలు పండించుకోవచ్చని తెలిపారు. రైతులు విధిగా వేసవి దుక్కులు చేసుకోవాలని, అలా చేసుకోవడం వల్ల నేల గుల్లబారి హానికరమైన సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. చిరుధాన్యాల సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని, వీటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం శత శాతం రాయితీపై ఊదలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ లింగాల మధుబాబు, సిహెచ్ వెంకటరావు, రేవతి, ఎఒ దాన కర్ణుడు, టి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం మేలు : ఆత్మ పీడీ

టెక్కలి: మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు చోటు చేసుకోవాలని, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు దృష్టి పెట్టాలని ఆత్మ పీడీ కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని నర్సింగపల్లి రైతుభరోసా కేంద్రంలో మట్టి నమూనాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి సారవంతమైనది అయితేనే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. వివిధ పంటలను బట్టి ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. ఎంపిపి ఆట్ల సరోజనమ్మ మాట్లాడుతూ వ్యవసాయంలో మెళకువల్ని పాటించి తద్వారా నూతనమైన పద్ధతులను అనుసరించాలని కోరారు. ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని కోరారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పినకాన వైకుంఠరావు మాట్లాడుతూ శిక్షణలో అవగాహన చేసుకున్న అంశాలును క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నర్సింగపల్లి, ముఖలింగాపురం సర్పంచ్‌లు రౌతు జయమోహన్, బందపల్లి రాకేష్, ఎంపిటిసి రౌతు బృందావతి, ఉపసర్పంచ్ మెండ భాస్కరరావు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని బూర్జపాడులో భూసార పరీక్షలపై వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చినట్లు ఎఒ శ్రీదేవి తెలిపారు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపిపి బోర పుష్ప మాట్లాడుతూ మట్టి పరీక్షల వల్ల భూమి సారవంతం తెలుస్తుందన్నారు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి నారాయణమ్మ, నూకయ్యరెడ్డి, మాజీ ఎంపిపి కె.మోహనరావు, ఎంపిటిసి డి.గురుమూర్తి, కేశపురం సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: తోటాడలోని రైతు భరోసా కేంద్రంలో భూసార పరిరక్షణ పథకంపై మండల స్థాయి శిక్షణా తరగతులను విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చరల్ అసిస్టెంట్లకు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భూసార పరీక్షా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ జి.సత్యవతి మాట్లాడుతూ భూసార పరీక్షలను రైతులు చేయించుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని తెలిపారు. పొలంలోని పోషకాలు జింక్, కాపర్, బోరాన్, నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం, సల్ఫర్ వంటి స్థాయిలను, నేల సత్తువను తెలుసుకోవచ్చని తెలిపారు. భూసార పరీక్ష ఫలితాలు వల్ల ఏయే ఎరువులను ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రజిని, ఎఒ మెట్ట మోహనరావు, అగ్రికల్చరల్ ఆక్షన్ ఆఫీసర్స్, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జెడి శ్రీధర్

కోటబొమ్మాళి: మట్టి పరీక్షలు ఆధారంగా ఏ పంట సాగుచేస్తే అధిక దిగుబడులు వస్తాయి, ఏయే ఎరువులు ఈ మట్టికి పనికివస్తాయి అనేది తెలుసుకోవచ్చని జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు అన్నారు. మండలంలోని లఖందిడ్డి గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో మట్టి పరీక్ష శిక్షణా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు కవిటి రామరాజు, లఖందిడ్డి, గంగరాం సర్పంచులు బమ్మిడి గణపతి, పేడాడ వెంకటరావు, ఎఒ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: భూసార పరీక్షలతో అధిక దిగుబడులను సాధించవచ్చని ఎఒ బెండి బాబ్జి అన్నారు. పొందూరు రైతు భరోసా కేంద్రం-1లో భూసార పరీక్షలపై శిక్షణను గురువారం గ్రామ వ్యవసాయ సహాయకులకు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కిల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల టెండర్లు అమోదం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల నేపథ్యంలో వివిధ అభివృద్ధి పనులకు వచ్చిన టెండర్లను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. పట్టణంలో యాత్రికులకు ఇబ్బందులు లేకుండా కేటాయించిన పబ్లిక్ మరుగుదొడ్లు, అంటువ్యాధులు ప్రబలకుండా తాగునీరు క్లోరినేషన్, వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు వచ్చిన టెండర్‌ను అమోదించింది. బోర్లు మరమ్మతులు గురైన వెంటనే బాగు చేసేందుకు కావాల్సిన పరికరాలు సిద్ధం చేస్తున్నారు. ట్యాంకరు వద్ద నీటి సరఫరా చేసేందుకు, చెరువులు వద్ద జంగిల్ క్లియరెన్స్ చెప్పట్టేందుకు జెసిబితో పనులకు టెండర్లు ఖరారు చేశారు. వీటితో పాటు రెండు చలి వేంద్రాలు ఏర్పాటు, బోర్ల మరమ్మతులకు రూ.2లక్షలు ఖర్చు చేసేందుకు, కొండి వీధిలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులకు రూ.1.70 లక్షలను కౌన్సిల్ ఆమోదించింది. మండపం వీధిలో స్లాబ్ కల్వర్టు వెంటనే ఏర్పాటు చేయాలని వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి సూచించారు. వీధి దీపాలు ఇంకా అనేక చోట్ల వెలగడం లేదని, వెంటనే వెలిగించేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలరు ఆసి లీలారాణి కోరారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ రెండు రోజుల్లో యుద్ధప్రాతిపదికన దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జిఒ 52ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - టెక్కలి

మాట్లాడుతున్న కృష్ణారావు

ఎస్‌టి జాబితాలో నకిలీ బెంతు ఒరియా, బోయ, వాల్మికీ, ఇతర కులాలను చేర్చేందుకు తీసుకొచ్చిన జిఒ 52ను, అసెంబ్లీలోచేసిన తీర్మానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు అన్నారు. గురువారం టెక్కలి అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19వ తేదీన జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని అడ్డుకుంటామని హెచ్చరించారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే 2024 అసెంబ్లీ ఎన్నికలను గిరిజనులంతా ఏకమై బహిష్కరిస్తామన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు జన్ని కాంతారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీని గెలిపించి ఇచ్చినందుకా గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది గిరిజనులు ఉన్నారని, కేవలం 6 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తున్నారని, ప్రస్తుతం బోయ, వాల్మీకి, నకిలీ బెంత్ ఒరియా కులాల వారిని ఎస్‌టిలో చేర్పిస్తే పూర్తిగా గిరిజనులకు ఉద్యోగ అవకాశాలకు దూరమవుతారన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక టెక్కలి నాయకులు లిజన్ని పోలయ్య, ఉమామహేష్, చాతివాడ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ప్రచార భేరి'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పలాస

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలపై ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే ప్రచార భేరిని విజయవంతం చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు ఎన్.గణపతి, సిహెచ్ సుందరలాల్, సిహెచ్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ప్రచార భేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి, ఈ ప్రచార భేరి ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మతతత్వ అజెండా అమలు చేస్తూ ప్రజలను చీల్చి, ప్రజా ధనాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను, సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు విభజన హామీలు అమలు చేయాలని, ఎపికి ప్రత్యేక హోదా కల్పించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ప్రజాస్వామిక హక్కులను కాపాడాలని ఈ ప్రచార భేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: ప్రచార భేరిని జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు లక్కోజు శ్రీనివాసరావు అన్నారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలోని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి కుంటుపడిందని, పేదలను దోచి అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసి బిజెపి పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.శ్రీనివాసరావు, ఎన్.కృష్ణ, అరవింద్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

రాష్ట్రాన్ని నాశనం చేశారు

ప్రజాశక్తి - పలాస

ర్యాలీ చేపడుతున్న టిడిపి నాయకులు

వైసిపి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఆరోపించారు. గురువారం 8వ వార్డు నర్సిపురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తమకు ఇంతకు ముందులా 90 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు వచ్చేవని, వ్యవసాయ రుణాలు, ట్రైకార్ రుణాలు అందేవని, వైసిపి వచ్చిన తరువాత అలాంటి పథకాలు రావడం లేదని రైతులు ఆయన వద్ద వాపోయారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ మాయ మాటలతో అధికారాన్ని దక్కించుకున్న జగన్ వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలంతా సిద్ధం కావాలని, యువత చైతన్యం చెందాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, చక్రధర్, నరసింహులు, మల్లేశ్వరరావు, రామకృష్ణ, సత్యం, కోరికాన శంకర్, బర్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విలాసాలకు పోవద్దు

ప్రజాశక్తి - ఆమదాలవలస

స్వయంశక్తి సంఘాల మహిళలు, వారి కుటుంబాల అభివృద్ధి కోసం ప్రతి ఏడాది మీ ఖాతాలకు మంజూరు చేస్తున్న వైఎస్ఆర్ ఆసరా నిధులను ఎవ్వరూ విలాసాల కోసం కాకుండా, కుటుంబ విలువలను కాపాడుకోవడానికి వినియోగించుకోవాలని, వైయస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. గురువారం మండలంలోని పొన్నాంపేట గ్రామంలో గ్రామ సంఘం స్థాయిలో మహిళా సంఘాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల గురించి ప్రతి సంఘ సభ్యురాలకు ఖచ్చితమైన అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులతో పాటు విఒఎ గాయత్రి ,స్వయంశక్తి సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

బిపి మండల్ వర్ధంతి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సంఘ సంస్కర్త, ఒబిసి సాధనకు ఆద్యుడు బిపి మండల్ 41వ వర్ధంతిని నగరంలోని జ్యోతిరావు పూలే పార్కులో గురువారం నిర్వహించారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి బిసి, బహుజన సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షులు పిట్ట చంద్రపతి రావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో మండల్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన వెనుకబడ్డ వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చారన్నారు. కార్యక్రమంలో కలగ జగదీష్ యాదవ్, అల్ ఇండియా దళిత్స్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కంట వేణు, గుత్తు చిన్నారావు, పిట్ట భాగ్య చంద్ర, కాయితీ వెంకట రమణ, గద్ధి బోయన క్రిష్ణ, కలగ గోపాలం, కాళ్ల వెంకట రావు, తదితరులు పాల్గొన్నారు.

యశోదమ్మ సేవాసమితి సాయం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జెండాల వీధికి చెందిన పారిశుద్య కార్మికురాలు సుహాసిని అనారోగ్యంతో బాధపడుతుందని తెలుసుకున్న యశోదమ్మ సేవాసమితి సభ్యులు మాదారపు డేవిడ్ రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. యశోదమ్మ 10వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, డేవిడ్ మిత్రబృందం హాజరై పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా సుహాసినికి సాయం అందజేశారు. కార్యక్రమంలో డేవిడ్, ప్రదీప్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

వైసిపి ప్రభుత్వ పాలనలో అడుగడుగునా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు ధ్వజమెత్తారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు కవ్వాడి సుశీలతో కలసి గురువారం విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్ల పాలనలో దళితుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఎస్‌సి కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి కనీసం రుణాలు లేకుండా చేసిందన్నారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, స్మృతివనాల ఏర్పాటు వల్ల గడిచిన నాలుగేళ్లలో దళితులపై సాగిన దమనకాండ మాసిపోదన్నారు.

బిసి కుల గణనతో ప్రయోజనం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలోని 189 బిసి కులాల జనగణన చేపట్టేందుకు ప్రభుత్వం కమిటీ వేయడం స్వాగతించదగ్గ అంశమని కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో కళింగ కోమటి సంఘం జిల్లా అధ్యక్షులు కోణార్క్ శ్రీనుతో కలసి గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే చట్టసభల్లో, పార్టీ పదవుల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిసిలకు ప్రాతినిధ్యం కల్పించారని చెప్పారు. జనాభా లెక్కల సేకరణలో కులం పట్టికలో చేర్చి కులగణన చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం, బిసిలు రాజకీయ, సామాజిక, సంక్షేమ రంగంలో ప్రాతినిధ్యం, ప్రాధాన్యంతో పాటు సంపూర్ణ సంక్షేమ ఫలాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పమన్నారు. సమావేశంలో నాయకులు అంధవరపు ప్రసాద్, సంతోష్, రమేష్, ఊణ్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంధవరపు సూరిబాబు

గడప గడపలో సంతోషం

ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - జి.సిగడాం

మా నమ్మకం నువ్వే జగన్ అన్నది ప్రజల నినాదం కావాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దేవరవలస గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చేనేతల కష్టాలు తెలుసుకొని, వాల సమస్యలను త్వరలోనే తీరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వెలగాడ గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.17.50 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్.ప్రసాద్, ఎంపిపి ఎం.సత్యవతి, వెంకటరమణ, జెడ్‌పిటిసి రమణ, ఎ.జగన్నాథం, డి.వెంకటరమణ, సర్పంచులు బి.లక్ష్మి భవాని, భూపతి సురేష్, ఎంపిటిసి పి.శాంతి, తదితరులు పాల్గొన్నారు.

కవిటి : స్టిక్కర్లు అతికిస్తున్న నాగభూషణం

జి.సిగడాం : చేనేత పట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పొందూరు: కరపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

కవిటి: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపలో సంతోషం వెల్లివిరుస్తోందని రెడ్డి జెఎసి రాష్ట్ర కార్యదర్శి బర్ల నాగభూషణం అన్నారు. స్థానిక బెహరా వీధిలో 'మా నమ్మకం నువ్వే జగన్' గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. అనంతరం లబ్ధిదారులు అనుమతితో వారి ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని కర్లెమ ఆర్అండ్ఆర్ కాలనిలో గురువారం వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ఆధ్వర్యాన జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో పుచ్చ అప్పారావు, పాల్గుణరావు, వైసిపి నాయకులు పడాల వెంకటకృష్ణ, రామ్ శంకర్, ఎల్.ఆనంద్, కె.తిరుపతిరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: సిఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యమని బొప్పాయిపురం సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా విక్రంపురం, నీలాపురం, బొప్పాయిపురంలో ఇంటింటికీ ప్రచారం చేపట్టారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి, పి.శ్రీనివాస్, ఆట్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని ధర్మపురంలో సర్పంచ్ మొదలవలస పాపారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, పప్పల రమేష్‌కుమార్, కొంచాడ రమణమూర్తి, మొదలవలస మురళీకృష్ణ, మొదలవలస వెంకటరమణమూర్తి, యతిరాజుల గోవిందరావు, చల్ల ముఖలింగం, గ్రామ వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు విజృంభిస్తున్నా పట్టించుకోరా?

ప్రజాశక్తి - బూర్జ

ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు బదులిస్తున్న అధికారులు

కలుషిత తాగునీరు తాగి ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారినపడినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఎంపిటిసి ప్రతినిధి మజ్జి నర్సింగరావు ప్రశ్నించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కర్నేన దీప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2019 నుండి తమ గ్రామంలో సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం అవుతోందని అన్నారు. గ్రామస్తులకు మినరల్ వాటర్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపిపి కలుషిత నీరు రావడం వాస్తవమేనని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సచివాలయ భవనం పూర్తయినా బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదని సర్పంచ్ ప్రతినిధి ఇప్పిలి సిమ్మన్న తెలిపారు. ఎంపిడిఒ రవీంద్రబాబు స్పందిస్తూ బిల్లులు చెల్లించి, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో కృష్ణవేణి, జెడ్‌పిటిసి రామారావు, కె.గోవిందరావు, రాంబాబు, కె.నాగేశ్వరరావు, రవీంద్రబాబు, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక

ప్రజాశక్తి -పలాస

మాట్లాడుతున్న సత్యనారాయణ

విద్యుత్ వినియోగదారులు సమస్యలుంటే తెలపాలని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఛైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. పలాస 33/11 కె.వి సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో అనేక సంస్కరణలు అమల్లో ఉన్నాయని, విద్యుత్ సమస్యలు స్థానికంగా పరిష్కారం కాకపోతే నేరుగా విశాఖపట్నం విద్యుత్ ప్రాంతీయ కార్యాలయంలో పరిష్కార వేదికకు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. న్యాయబద్ధంగా ఉంటే తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. ముందుగా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పి.శ్రీనివాసరావు, ఎస్.హరిబాబు, ఆర్.సురేంద్రకుమార్, టెక్కలి విద్యుత్‌శాఖ ఇఇ రాజశేఖర్, పలాస ఎడిఇ కృష్ణమూర్తి, ఎఇలు వివేక్, నాగభూషణ్, ఎల్ఐఇలు రాజారావు, గిరి, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్లకు నియామక పత్రాలు అందజేత

సోంపేట : నియామక పత్రం అందిస్తున్న ఎంఇఒ

టెక్కలి: 1998 డిఎస్‌సిలో ఉద్యోగాలు పొందిన పది మంది పలు పాఠశాలల్లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఇఒ నాగభూషణంను వారు మర్యాదపూర్వకంగా మండల రీసోర్స్ కేంద్రంలో కలుసుకున్నారు. వారికి ఎంఇఒ నియామక పత్రాలు అందించారు.

సోంపేట: 98 డిఎస్‌సిలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులకు ఎంఇఒ లక్ష్మణరావు నియామక పత్రాలు అందించారు. వారికి యుటిఎఫ్ నాయకుల కోదండరావు, పరమేశ్వరరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

పలాస: ఆరుగురికి ఎంఇఒ నియామక పత్రాలను అందజేశారు. వీరికి కోదండరావు, రమేష్, జగదీష్, తదితరులు అభినందించారు. పలాస మండలానికి చెందిన 15 మంది ఉపాధ్యాయులకు ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు నియామకపత్రాలు అందజేశారు.

కవిటి: 1998 డిఎస్‌సిలో క్వాలిఫై అయిన 9మందికి మండలంలో వివిధ పాఠశాలల్లో నియమించినట్టు ఎంఇఒ ధనుంజయ మజ్జి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో వారికి నియామక పత్రాలు అందించినట్లు ఆయన తెలిపారు.

మెళియాపుట్టి: మండలంలో 12 మందికి నియామక పత్రాలను ఎంఇఒ దేవేంద్రరావు అందజేశారు.

వజ్రపుకొత్తూరు : బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన పొట్నూరు మురళీకృష్ణ , గరుగు సింహాచలంకు ఎంఇఒ నియామక పత్రాలు అందించారు. వారిని పలువురు అభినందించారు.

ఆస్పత్రి సిబ్బందిపై కానరాని చర్యలు!

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ప్రసవం కోసం వచ్చిన గర్భిణి, ఆశాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సిబ్బందిపై దర్యాప్తు చేసిన అధికారులు తదుపరి చర్యలకు వెనకాడటంపై సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సబ్ కలెక్టర్ చేపట్టిన దర్యాప్తు నివేదిక అనంతరం వారిపై చర్యలు లేకపోవడంతో ఉన్నత స్థాయి అధికారుల వైఖరిపై గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నెల 2న గర్భిణికి వైద్యం అందించకుండా దుర్భాషలాడిన మ్యాట్రీ సిబ్బంది తీరు వివాదస్పదమైన విషయం తెలిసిందే. దీనిపై సబ్ కలెక్టర్ ఆస్పత్రి సిబ్బంది, బాధితురాలి బంధువులతో రెండు రోజుల పాటు విచారణ చేశారు. ఈ వ్యవహారంపై రెండు రోజుల్లో చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ విచారణ జరిగి వారం రోజులు కావస్తున్నా నేటి వరకు కారకులపై చర్యలు లేకపోవడం విస్మయానిరి గురి చేస్తోంది. పేరుకే జిల్లా ఆస్పత్రి, సేవలు అందించడంలో పిహెచ్‌సి కంటే దారుణంగా ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రి సర్వసభ్య సలహా సమావేశం నిర్వహించేందుకు సబ్ కలెక్టర్ సిద్ధమైనప్పటికీ నిర్వాహణలో అలసత్వం జరుగుతోంది. ఏదిఏమైనా ఆస్పత్రి పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -ఆమదాలవలస

అంగన్వాడీ ప్రాజెక్ట్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు మహిళా శిశుఅభివృద్ధి అధికారి కొత్తకోట బాలామణి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఎస్‌సి కేటగిరికి, సరుబుజ్జిలి మండలంలోని నక్కలపేట కార్యకర్త పోస్టు ఎస్టీలకు కేటాయించారు. సహాయకుల పోస్టులకు ఎల్ఎన్‌పేట మండలంలోని చింతలబడవంజ ఎస్‌టి, తురకపేట ఎస్‌సి, పాతపట్నం మండలంలోని కవిటి బిసిబి, సరుబుజ్జిలి మండలంలోని విజయరాంపురం బిసిబి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ ఎస్టిలకు రోస్టర్ పద్ధతిలో కేటాయించడం జరిగిందని అర్హులైన అభ్యర్థులు ఈనెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి - పోలాకి

ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏడాదీ మహాత్ములు పుట్టిన రోజులు, ముఖ్య దినములపై చర్చించి నిర్ణయం చేసేందుకు స్టాట్యుటరీ గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధించిన అధికారులు హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారం అందించేందుకే..

ప్రజాశక్తి - టెక్కలి

విద్యార్థులకు పౌష్టికాహారం అందివ్వాలన్న ఉద్దేశంతోనే జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తున్నామని, దీనిపై ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపిపి ఎ.సరోజనమ్మ అన్నారు. నర్సింగపల్లి జెడ్‌పి పాఠశాలలో గోరుముద్ద పథకాన్ని ఆమె పరిశీలించారు. ఆమె విద్యార్థులతో మాట్లాడి ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు ఆమె స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సోమేశ్వరరావు, సర్పంచ్ రౌతు జయమోహన్, ఎంపిటిసి రౌతు బృందావతి, ఉపాధ్యాయులు పాలవలస ధర్మారావు, రోణంకి విజయ్‌కుమార్, యరపత్ని వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపిపి